సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 17 । మార్చి । 2024



ఉట్నూర్‌లో వర్షం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొద్దిరోజులుగా పెరిగిన ఎండలతో సతమతమవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది : 6:27	సోమ : 5:00

గరిష్టం/కనిష్టం
34.0/23.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. సాయంత్రం పలుచోట్ల చిన్నపాటి వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

రాజీ మార్గమే మేలు



రాజీపత్రం అందజేస్తున్న జిల్లా జడ్జి

ఆదిలాబాద్‌టౌన్: కక్షిదారులకు రాజీ మార్గమే మేలని జిల్లా జడ్జి డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. అనంతరం రాజీతో కేసులు పరిష్కరించుకున్న పలువురికి పత్రాలు అందించారు. న్యాయమూర్తులు డాక్టర్ శివరాంప్రసాద్, ప్రమీల జైన్, దుర్గారాణి, మంజుల సూర్యవార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, డీఎస్పీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ 2024–25 విద్యాసంవత్సరంలో ఇవ్వనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి రాజలింగు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 28వ తేదీన జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన జిల్లాలోని మైనార్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా కాన్షీరాం జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ మహరాజ్ కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు కొనియాడారు. కాన్షీరాం ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ధర్మ సమాజ పార్టీ నాయకులు బడుగు రాజేశ్వర్, నలగంటి రవి, బండారి సంతోష్, సంగర్తి రామచందర్, నవీన్‌కుమార్, సాయి, సురేశ్, విఠల్, వినుకుమార్, శ్రీనివాస్, చరణ్ తదితరులున్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీలత

తాంసి: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెత్తాచెదారం తొలగించాలని, మురుగుకాలువలు శుభ్రం చేయాలని డీపీవో శ్రీలత సూచించారు. శనివారం మండలంలోని పొన్నారి గ్రామాన్ని సందర్శించారు. పారిశుధ్య పనులు పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నర్సరీలో మొక్కల సంరక్షణపై శ్రద్ధ చూపాలని సూచించారు. పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీవో స్వప్నశీల, గ్రామ ప్రత్యేకాధికారి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి విజయ్ తదితరులున్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కైలాస్‌నగర్: ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై శనివారం సంబంధిత అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాధికారి ప్రణీత, ఆర్డీవో వినోద్‌కుమార్ తదితరులున్నారు.

మోగిన నగారా



- సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల
- 'ఆదిలాబాద్' పరిధిలో ఓట్ల పండుగ
- ప్రచార జోరు పెంచనున్న పార్టీలు
- అమలులోకి కోడ్.. అభివృద్ధికి బ్రేక్
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

సాక్షి, ఆదిలాబాద్: సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగింది. సెంట్రల్ ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌కు జరిగే ఎన్నికలకు రాజకీయ పార్టీలు సిద్ధమయ్యాయి. కాగా, పోలింగ్ జరిగిన 22వ రోజు ఫలితాలు వెలవడనున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ దశల్లో ఎన్నికలు జరుగుతుండటంతో రిజల్ట్స్ రావడానికి ఇంత సుదీర్ఘ సమయం పట్టనుంది.

కోడ్ కూసింది..!

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పాటు కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిలిచిపోనున్నాయి. జూన్ 6వ తేదీ వరకు కోడ్ అమలులో ఉండనుంది. తద్వారా 82రోజుల పాటు ఈ బ్రేక్ పడనుంది. కాగా, అధికారులు ఎన్నికల ఏర్పాట్లు ప్రారంభించారు. గత ఫిబ్రవరి 8వ తేదీన ఓటరు తుది జాబితా విడుదల చేశారు. మళ్లీ కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఇవ్వడంతో ప్రస్తుతం ప్రక్రియ కొనసాగుతోంది. ఏప్రిల్‌లో ఓటరు సప్లిమెంటరీ జాబితా విడుదల కానుంది. ఇదే ఎన్నికలకు తుది ఓటరు జాబితా అవుతుంది. కాగా, ఎన్నికల నిర్వహణకు అధికారులు ఇప్పటికే ప్రక్రియ ప్రారంభించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈసారి పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరగనుంది. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది నియామకం కూడా చేపట్టనున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్లు, కంట్రోల్ యూనిట్ల పరిశీలన చేపట్టాల్సి ఉంది. సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

గతం కంటే పెరిగిన ఓటర్లు

2019లో పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అప్పుడు 14,88,353 మంది ఓటర్లున్నారు. ఈ ఎన్నికలకు ఇప్పటివరకు 1,56,362 మంది కొత్త ఓటర్లు పెరిగారు. సిర్పూర్ మినహా అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల ఆధిక్యత ఉంది. పార్లమెంట్ నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. తద్వారా ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లదే కీలక భూమిక కానుంది.

పార్లమెంట్ పరిధిలోని ఓటర్ల వివరాలు
ఓటర్ల సంఖ్య : 16,44,715
పురుషులు :8,02,575
మహిళలు : 8,42,054
ఇతరులు : 86

షెడ్యూల్ ఇలా..
నోటిఫికేషన్ జారీ : ఏప్రిల్ 18
నామినేషన్లకు చివరి తేదీ : ఏప్రిల్ 25
నామినేషన్ల పరిశీలన : ఏప్రిల్ 26
నామినేషన్ల ఉపసంహరణ : ఏప్రిల్ 29
పోలింగ్ : మే 13
ఓట్ల లెక్కింపు : జూన్ 4

ఊపందుకోనున్న ఎన్నికల ప్రచారం

ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. సిర్పూర్, ఆసిఫాబాద్, ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్ ఈ నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. కాగా, ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించాయి. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎంపీగా గెలుపొందిన సోయం బాపూరావును ఈసారి ఆ పార్టీ దూరం పెట్టింది. గులాబీ పార్టీ నుంచి నుంచి ఇటీవలే బీజేపీలో చేరిన గోడం నగేశ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును బరిలోకి దింపారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. కాగా, ఎన్నికల షెడ్యూల్ జారీతో ఇక పార్టీల ప్రచారం ఊపందుకోనుంది. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్రమోదీ నియోజకవర్గంలో పర్యటించారు. ఇక ముఖ్య నేతలు ప్రచార నిమిత్తం రానున్నారు.

'ఏనుగు' పార్టీలో అయోమయం !

- 'ఆర్ఎస్పీ' రాజీనామాతో సందిగ్ధంలో కేడర్
- బీఆర్ఎస్‌లో చేరుతారని జోరుగా ప్రచారం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ (ఆర్ఎస్పీ) ఆ పార్టీని వీడడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆయన వెంట నడిచిన నాయకులు, కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. బహుజనవాదంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సిర్పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఒక దశలో ఆయన గెలుస్తారనే ధీమా కేడర్‌లో నింపారు. కానీ, ఆయన మూడో స్థానానికి పరిమితమయ్యారు. ఆ తర్వాత కూడా పలుసార్లు సిర్పూర్ నియోజకవర్గానికి వచ్చారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు తెరపైకి రావడం తెలిసిందే. దీంతో నియోజకవర్గంలో తన ఓటమికి కారణమైన ఆర్ఎస్పీతో పొత్తును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోనేరు కోనప్ప తన సోదరుడు జెడ్పీ ఇన్‌చార్జి చైర్మన్ కృష్ణారావు, నాయకులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా ప్రవీణ్‌కుమార్ బీఎస్పీని వీడడంతో బీఆర్ఎస్‌లో చేరుతారనే ప్రచారం మొదలైంది. దీనిపై ఆర్ఎస్పీ ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీగా పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

బలం పెరిగి, బలహీన పడి..

రాష్ట్రంలో బీఎస్పీకి అధ్యక్ష హోదాలో మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఉండడంతో ఉమ్మడి జిల్లాలో పార్టీకి ఆదరణ ఉంటుందని కేడర్‌లో నమ్మకం పెరిగింది. ఆయన పోటీ చేసిన స్థానంలోనైనా గెలుస్తారనే నమ్మకం కల్పించారు. ఇందుకోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ పార్టీ బలోపేతం చేయాలని అసెంబ్లీ ఎన్నికల ముందు తీవ్రంగా శ్రమించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కోస్నిలోనే నివాసం ఏర్పర్చుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లో తమ అభ్యర్థులను ఎన్నికల బరిలో దింపారు. 2014లో నిర్మల్ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సిర్పూర్‌లో కోనేరు కోనప్ప బీఎస్పీ నుంచే పోటీ చేసి ఏనుగు గుర్తుపై గెలిచారు. అదే నమ్మకంతో సిర్పూర్‌లో ఆర్ఎస్పీ బరిలోకి దిగారు. సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ కార్యదర్శిగా పని చేసిన పరిచయాలు, 'స్వేరో' సైన్యం, దళిత, బీసీ, మైనార్టీల మద్దతుతో పార్టీని బలోపేతం చేశారు. చాలామంది మాజీ ఐపీఎస్ పిలుపుతో పార్టీలో చేరారు. గత ఎన్నికల్లో ఆశించిన తీరులో పార్టీ ఫలితాలు రాకపోవడంతో కేడర్ నిరాశ చెందింది. తాజాగా లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆదిలాబాద్, పెద్దపల్లి నుంచి ఆశావహులు పోటీలో ఉంటారని ప్రణాళికలు వేస్తున్నారు. అయితే పార్టీ అధ్యక్షుడి రాజీనామాతో ఏం చేయాలనే సందిగ్ధంలో పడ్డారు. కొంతమంది పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉండగా, మరోవైపు బీఎస్పీలోనే కొనసాగేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

కవిత అరెస్ట్‌పై ఆందోళన



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేయడంపై శనివారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆందోళన నిర్వహించింది. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి నాయకులు నల్ల జెండాలు, డప్పుచప్పుళ్లతో కలెక్టర్‌చౌక్‌కు చేరుకుని రాస్తారోకో చేశారు. బీజేపీ దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, నాయకులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం బీజేపీ ఫ్లెక్సీ దహనం చేసి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడారు. బీఆర్ఎస్‌కు లభిస్తున్న జనాదరణ చూసి ఓర్వలేకే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, ఎంపీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఎంపీపీ రమేశ్, నాయకులు జగదీశ్, రమేశ్, భరత్, రాము, శ్రీనివాస్, ప్రహ్లాద్, పర్వీన్, పవన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో వైద్యుల నియామకం



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 31మంది హాజరు కాగా, 28 మందిని ఎంపిక చేసి డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ వారికి నియామక పత్రాలు అందజేశారు. ఒక ప్రొఫెసర్, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు, తొమ్మిది మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఏడుగురు సీనియర్ రెసిడెంట్లు, ఎనిమిది మంది ట్యూటర్లను నియమించారు. కాగా, కొద్దిరోజులుగా సూపర్ స్పెషాలిటీలో ఖాళీగా ఉన్న కార్డియాలజీ పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. న్యూరోసర్జన్, రేడియాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనిక్ తదితర పోస్టులనూ భర్తీ చేశారు. త్వరలోనే క్యాథ్‌లాబ్ అందుబాటులోకి రానుందని రిమ్స్ డైరెక్టర్ తెలిపారు. గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.

క్రీడా పాఠశాలల్లో సత్ఫలితాలు



పోటీలు ప్రారంభిస్తున్న ఏపీవో భాస్కర్

ఉట్నూర్‌రూరల్: గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో సత్ఫలితాలు వస్తున్నాయని ఐటీడీఏ ఏపీవో ఆత్రం భాస్కర్ పేర్కొన్నారు. శనివారం ఉట్నూర్ గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాల మైదానంలో ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా పాఠశాలల తుది ఎంపిక పోటీలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారుల ప్రోత్సాహం, కోచ్‌ల ఉత్తమ శిక్షణతో ఎంతోమంది విద్యార్థులు జాతీయస్థాయిలో పతకాలు సాధించారని గుర్తు చేశారు. ఉట్నూర్, జాతర్ల క్రీడాపాఠశాలలకు గుర్తింపు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి మాట్లాడుతూ.. క్రీడా పాఠశాలలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రాజెక్టు అధికారి, జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ ఆమోదంతో త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. వీరి నుంచే ఈ నెల 18వ తేదీన హైదరాబాద్‌లో జరిగే వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాల కోసం పంపిస్తామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఏటీడీవో క్రాంతికుమార్, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ ఉత్తం, ఎంఎస్‌వో హేమంత్, శ్రీనివాస్, రవీందర్, జైవంత్‌రావు, జల్పతి, కోచ్‌లు సునంద్, శివకృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'మూడోసారి మోదీనే ప్రధానిని చేద్దాం'



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్

నేరడిగొండ: బీజేపీని ఆదరించి మోదీనే మూడోసారి ప్రధానిని చేద్దామని, ఆదిలాబాద్ అభ్యర్థి గోడం నగేశ్‌ను ఎంపీగా గెలిపించుకుందామని పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న 42మందిలో ఎవరూ పార్టీని వీడరని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో రెండుసార్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. బీజేపీని గెలిపిస్తే ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్‌కు రైలు మార్గాన్ని, ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్ట్ తీసుకువస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు సాబ్లే సంతోష్‌సింగ్, సోలంకి ప్రశాంత్, బంటు ప్రవీణ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చొక్కపల్లి రాములు, యువమోర్చా మండలాధ్యక్షుడు బాక్రే లక్ష్మణ్, దళిత మోర్చా మండలాధ్యక్షుడు ధర్మపురి రాఘవులు, ఓబీసీ మోర్చా మండల కార్యదర్శి బాక్రే శంకర్, నాయకులు గంగాధర్, ప్రవీణ్‌నాయక్, నవీన్, కోసేరావ్ తదితరులు పాల్గొన్నారు.

మాస్‌కాపీయింగ్‌కు రంగం సిద్ధం!

- ఇష్టారీతిన ఎస్సెస్సీ పరీక్షల విధులు
- నిబంధనలు పాటించని అధికారులు
- ఉపాధ్యాయ సంఘాల మండిపాటు



ఆదిలాబాద్‌టౌన్: ఈ నెల 18వ తేదీ నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మాస్‌కాపీయింగ్‌కు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. చదువు చెప్పిన గురువులే దీనిని ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇన్విజిలేటర్ల కేటాయింపులో నిబంధనలు పాటించలేదనే విమర్శలున్నాయి. నచ్చిన వారికి కోరుకున్న చోట విధులు కేటాయించారనే ఆరోపణలున్నాయి. 50శాతం ఎస్జీటీలకు, 50 శాతం స్కూల్ అసిస్టెంట్లకు విధులు కేటాయించాల్సి ఉంది. నిబంధనల ప్రకారం ఎనిమిది కిలో మీటర్ల పరిధిలో ఇన్విజిలేషన్ విధులు కేటాయించాల్సి ఉండగా అలా జరగలేదు. కొందరు మండల విద్యాధికారులు తమకు నచ్చినట్లుగా విధులు కేటాయించి విద్యాశాఖను అభాసుపాలు చేసేలా వ్యవహరిస్తున్నారు.

కోరుకున్న చోట విధులు..!

పైరవీ చేసుకున్న వారికి డ్యూటీలు రద్దు చేసి మరికొందరికి కోరుకున్నచోట కేటాయించారు. వీరి తీరు విద్యావ్యవస్థను నాశనం చేసేలా ఉందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. తలమడుగు హెచ్‌ఎంకు భరంపూర్‌లో, భరంపూర్ హెచ్‌ఎంకు తలమడుగులో సీఎస్ విధులు కేటాయించారు. ఇది పరస్పర ఒప్పందమని, మాస్‌కాపీయింగ్ జరిపించేందుకేననే ఆరోపణలున్నాయి. ఈ రెండు మండలాల్లో స్కూల్ అసిస్టెంట్లకు కాకుండా ఎస్జీటీలకే విధులు కేటాయించడంపై ఉపాధ్యాయులు మండి పడుతున్నారు. తాంసి మండలం గోట్కూరిలో పని చేసే హెచ్‌ఎంకు జైనథ్ మండలం పెండల్‌వాడకు, తలమడుగు మండలం కుచులాపూర్‌లో పని చేసే హెచ్‌ఎంకు భీంపూర్ మండలం అందర్‌బంద్ లాంటి దూరప్రాంతాల్లో విధులు కేటాయించారు. ఉపాధ్యాయులకు ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో మాత్రమే ఇన్విజిలేషన్ డ్యూటీలు కేటాయించాల్సి ఉండగా బోథ్ మండలంలో ఇష్టారీతిన కేటాయించారు. బేల మండలం వరూర్, కరోని, నేరడిగొండ మండలం సుర్గాపూర్‌లో ఏకోపాధ్యాయ పాఠశాలలుండగా ఇక్కడి ఉపాధ్యాయులకు ఎస్సెస్సీ విధులు కేటాయించారు. దీంతో ఈ పాఠశాలలు మూతపడే పరిస్థితి ఉంది.

కాపీయింగ్‌కు అడ్డుకట్ట పడేనా?

పదోతరగతి పరీక్షల్లో రెండుమూడేళ్లుగా జోరుగా మాస్ కాపీయింగ్ జరుగుతుందనే విమర్శలున్నాయి. కొందరు ఇన్విజిలేటర్లే విద్యార్థులకు దగ్గరుండి చూచిరాతలు రాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రశ్నపత్రం ఇచ్చిన తర్వాత కొన్ని ప్రశ్నలు బయటకు పంపించి జవాబులు రాయించి జిరాక్స్ చీటీలు విద్యార్థులకు అందిస్తున్నట్లు సమాచారం. పార్ట్–బీ కూడా చెప్పడంతో కష్టపడి చదివిన విద్యార్థులు నష్టపోతున్నారు. 10 జీపీఏ, ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించడమే లక్ష్యంగా కొందరు ఉపాధ్యాయులు ఈ తతంగానికి తెరలేపినట్లు తెలిసింది. మెరుగైన ఫలితాలే లక్ష్యంగా కొందరు అధికారులు దీనిని ప్రోత్సహిస్తుండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పరీక్షా కేంద్రంలో అధికారులను మచ్చిక చేసుకుని తమ విద్యార్థులకు సహకరించాలంటూ ఇప్పటి నుంచే విందులు, నజరానాలకు ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం

పదోతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం. మాస్‌కాపీయింగ్ జరగకుండా చర్యలు చేపడతాం. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తారు. నిబంధనల ప్రకారమే సీఎస్‌లు, ఇన్విజిలేటర్ల విధులు కేటాయించాం. – ప్రణీత, జిల్లా విద్యాధికారి

ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో, అధికారులు

కైలాస్‌నగర్: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదల చేసిన నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికలాధికారులతో మాట్లాడారు. శనివారం నుంచే పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున తక్షణమే పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగులు, వివిధ ప్రచార సామగ్రి తొలగించాలని, ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. తక్షణమే జిల్లాస్థాయి ఫిర్యాదుల కమిటీ పని ప్రారంభించేలా చూడాలని, నివేదికలను ఎప్పటికప్పుడు పంపించాలని ఆదేశించారు. ఈవీఎంల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, సోషల్ మీడియాలో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని తెలిపారు. కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటుతోపాటు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లను తక్షణమే రంగంలోకి దింపాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికలాధికారి రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కడెం: మండలంలోని చిట్యాల్ గోదావరి రేవు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్‌ను తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కడెం మండలంలోని నర్సింగాపూర్‌లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్న బొలేరో వాహనాన్ని శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన యాభై క్వింటాళ్ల బియ్యం, వాహనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఫుడ్ లైసెన్స్ తప్పనిసరి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో వ్యాపారాలు నిర్వహించే వారందరూ ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని ఫుడ్‌సేఫ్టీ అధికారి వాసురాం సూచించారు. జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, పాల కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. శుభ్రత పాటించని 3 హోటళ్లు, 3 పాల కేంద్రాలకు అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ ఆదేశాల ప్రకారం రూ.1,92,000 జరిమానా విధించారు. ఫుడ్ లైసెన్స్ లేనివారికి ఆరు నెలలు జైలు, రూ.5 లక్షల జరిమానా విధించబడుతుందని తెలిపారు.

ఆటో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రాంనగర్‌కు కాలనీకి చెందిన మహ్మద్ మూసాకు చెందిన ఆటో శుక్రవారం రాత్రి చోరీకి గురైంది. ఈద్గా వద్ద గల మజీద్‌లో నమాజ్ వెళ్లారు. నమాజ్ తర్వాత రాత్రి 11గంటల తర్వాత తిరిగి వచ్చి చూసే సరికి ఆటో కన్పించకుండా పోయింది. దీంతో చుట్టు పక్కల గాలించినప్పటికీ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు.

పోస్టల్ అధికారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రధాన పోస్టాఫీసు మేనేజర్ జాదవ్ విజయ్‌పై టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సదరు మేనేజర్ పోస్టాఫీసులో ఖాతా కలిగిన రైతులకు సంబంధించి డబ్బులు రూ.36లక్షలు రైతుల అకౌంట్‌లో కాకుండా సొంత అకౌంట్‌లో వేసుకుని మోసానికి పాల్పడ్డాడు. ఈ మేరకు హబిట్స్ హైదరాబాద్ జనరల్ పోస్టాఫీసు చీఫ్ మేనేజర్ భూక్యా భాస్కర్ నాయక్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'మిషన్ భగీరథలో శ్రమ దోపిడీ అరికట్టాలి'

నిర్మల్‌చైన్‌గేట్: మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చి పీఎల్ఆర్ కంపెనీ శ్రమ దోపిడీని అరికట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిర్మల్ జిల్లా కమి టీ అధ్యక్షుడు డాకూర్ తిరుపతి డిమాండ్ చేశా రు. ఈమేరక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవోకు శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ కడం ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్న పీఎల్ఆర్ కంపెనీ వాటర్ సప్లయ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. రూ.16 వేల కనీస వేతనం చెల్లించాల్సి ఉండగా, రూ.8 వేల మాత్రమే చెల్లిస్తుందని తె లిపారు. 70 నుంచి 80 మంది కార్మికులు పని చేస్తుంటే 150 మంది పని చేస్తున్నట్లుగా తప్పు డు లెక్కలు చూపి ప్రభుత్వం నుంచి డబ్బులు కాజేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా నాయకుడు చందుల సాయికిరణ్ ఉన్నారు.

స్వేచ్ఛగా పరీక్ష రాసేద్దాం..



- రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు
- ఒత్తిడి అధిగమిస్తే విజయం మీదే..
- ఆశావహ దృక్పథంతో హాజరుకండి..
- విద్యారంగ నిపుణులు, విజేతలు, మనోవికాసవేత్తల సూచన

నిర్మల్‌ఖిల్లా: పరీక్షలు, మార్కులు జీవితానికి పరమావధి కాదు. అయినా చదువుతో సమాజంలో మంచి స్థానం లభిస్తుంది. పాఠశాల స్థాయి దాటేందుకు వారధిలాంటి పదో తరగతి పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే తొలిసారి బోర్డు పరీక్షలు రాయనున్న విద్యార్థులు కొంతమేర ఒత్తిడి, ఆందోళన సహజంగానే ఉంటుంది. స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలకు హాజరైతే ఆకాశమంత ఆత్మవిశ్వాసం కలిగి ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చని అంటున్నారు. ఏడాదంతా నేర్చుకున్న చదువును ప్రదర్శించేందుకు ఇదొక మంచి అవకాశంగా భావించాలని విద్యారంగ నిపుణులు, విజేతలు, మనోవికాసవేత్తలు సూచిస్తున్నారు. పదో తరగతి పరీక్షలు మొదలుకానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం...

8923 మంది విద్యార్థులు...

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే నిర్మల్ జిల్లాలో దాదాపు 8,923 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యార్థులు పరీక్షలను ఆశావాహ దృక్పథంతో, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటే మంచి ఫలితాలను అలవోకగా సాధించవచ్చని విద్యావేత్తలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మరికొన్ని ముఖ్య సూచనలు...

- విద్యార్థి తెలివితేటలను హరించి వేసేది ఒత్తిడి. మొదట ఒత్తిడిని దరిచేరనీయవద్దు. ఈ పరీక్షలు కేవలం పైతరగతులకు వెళ్లేందుకే ఉద్దేశించినవనే ధోరణితో పరీక్షలకు హాజరు కావాలి.
- పరీక్షలే జీవిత సర్వస్వం కాదని గుర్తించాలి. నమ్మకమే మనిషిని నడిపిస్తుంది. విజయం సాధించేందుకే మనమున్నామనే బలమైన ఆశావహ దృక్పథాన్ని కలిగి ఉంటే విజయానికి బాటలు వేస్తుంది.
- విద్యార్థులకు 10/10 రావడం ఒక్కటే జీవితంలో ప్రధాన లక్ష్యం కాదని గుర్తించాలి. ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆ విషయంలో ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి.
- పరీక్షలకు సన్నద్ధమయ్యే క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన వాటిని సమకూర్చాలి.

ఆందోళన జయిస్తే గెలుపు మీదే...



విద్యార్థులకు సమయ పాలన చాలా ముఖ్యం. చేయగలిగే లక్ష్యాలను మాత్రమే ఎంచుకోవాలి. ప్రశ్న పత్రంలో కూడా అదే విధంగా తగిన ప్రశ్నలకు సమాధానాలు ఎంచుకున్న తర్వాత వాటి సమాధానాలను రాస్తూ వెళ్లే క్రమంలో ఏదైనా మర్చిపోతే అక్కడే ఆగిపోకుండా ముందుకెళ్లాలి. పరీక్షల సమయంలో తగిన నిద్ర ఉంటేనే చదువుకున్నది గుర్తుంటుంది. అందుకే ప్రతిరోజు దాదాపు 6 నుండి 8 గంటలు పడుకోవాలి. ప్రణాళిక ప్రకారం చదువుకోవాలి. పరీక్షలను సరిగా రాయలేకపోతున్న విద్యార్థులు కృంగిపోవాల్సిన అవసరం లేదు. చదివే సర్వస్వం కాదు. తల్లిదండ్రులు పిల్లలను చదువు పట్ల ఎక్కువ ఒత్తిడి చేయవద్దు.

– భూమన్న యాదవ్, మనోవికాస నిపుణులు, మోటివేషనల్ స్పీకర్, నిర్మల్

పాఠశాలల్లో రాసే పరీక్ష లాంటివే..



విద్యార్థులకు పరీక్షల రాయడం కొత్త కాదు. ఏడాదంతా నెల, త్రైమాసిక, అర్ధ వార్షిక పరీక్షలు రాస్తూనే ఉంటారు. కాకపోతే ఇతర పరీక్ష కేంద్రంలో రాస్తున్నామని భయం వారిని తొలచివేస్తుంది. ఆ భయాన్ని వీడాలి. క్రమశిక్షణతో కూడిన కార్యాచరణను అమలుపరిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయి. మన భవిష్యత్ కోసం మనం కష్టపడుతున్నామనే భావనను పెంపొందించుకొని కాలక్షేపం వంటి వాటికి దూరంగా ఉండాలి. టీవీ, మొబైల్ ఫోన్ వంటి వాటితో సమయాన్ని వృథా చేయవద్దు. ప్రిపరేషన్ సమయంలో మధ్య మధ్యలో స్వల్ప విరామం ఇవ్వాలి. పరీక్ష సమయానికి కనీసం రెండు గంటల ముందు చదవడం ఆపేసి ప్రశాంతంగా గడపాలి.

– డాక్టర్ బి.సాయిప్రసన్న, ఎంబీబీఎస్ వైద్య విద్యార్థిని, చించోలి–బి.

ఆశావహ దృక్పథం అవసరం..



ఒక పరీక్ష రాశాక దాని గురించి పూర్తిగా మర్చిపోవాలి. విద్యార్థుల దృష్టి తర్వాతి రోజు రాయనున్న పరీక్షపైనే కేంద్రీకరించాలి. ఫలానా ప్రశ్నకు సమాధానాన్ని సరిగా రాయలేదని భావనను మనసులోనికి రానీయకూడదు. మార్కుల గురించి ఆలోచనలు వదిలివేయాలి. ప్రశాంతంగా ఉంటేనే మెదడు చురుకుగా పనిచేస్తుంది. మధ్య మధ్యలో కాస్త విరామం ఇస్తూ సాధన చేయాలి. బాగా రాయదగిన అంశాలను ముందుగా ఎంచుకొని సమాధానాలు రాయడం ఉత్తమం. చేతిరాత బాగుండేలా సాధన చేయాలి. ప్రతిరోజు తగిన మోతాదులో దాదాపు 6 నుండి 8 గ్లాసుల నీళ్లు తాగాలి.

–రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్

ఆర్జీయూకేటీలో కథక్ ప్రదర్శన



ప్రదర్శనలో విద్యార్థులు

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో శనివారం కథక్ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్పిక్‌మెకే (సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమోంగ్స్ యూత్) తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో చేపట్టిన కథక్ వర్క్‌షాప్ డెమోన్‌స్ట్రేషన్ ప్రోగ్రాం ఈనెల 11 నుంచి బాసర, ముథోల్ మండలాల పరిధిలోని పది పాఠశాలల్లో కథక్ నృత్యప్రదర్శన నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమం బాసర ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కథక్ నృత్యకారిణి సృష్టి జునార్కర్ ప్రదర్శన ఆకట్టుకుంది. ఈనెల 11 నుంచి జిల్లా విద్యాశాఖ సౌజన్యంతో జెడ్పీహెచ్ఎస్ ఆష్ట, జెడ్పీహెచ్ఎస్ (ఉ/మీ) బాసర, జెడ్పీహెచ్ఎస్ కౌట, టీఎమ్మార్ఈఐఎస్ ఐఎస్ ముథోల్, జెడ్పీహెచ్ఎస్ (బాలికల) బాసర, కేజీబీవీ ముథోల్, జెడ్పీహెచ్ఎస్ (బాలికల) మథో ల్, టీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాల ముథోల్, జెడ్పీహెచ్ఎస్ ముథోల్ పాఠశాలలో ప్రదర్శన నిర్వహించారు.

ముగింపు..

ఆర్జీయూకేటీలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సృష్టి మొదటగా తమ గురువులను తలుచుకుంటూ గురు వందనతో నృత్యం ప్రారంభించిన ఆమె, తన హావభావాలతో ఆకృష్ణుని కోసం వెతుకుతున్న గోపికలను చూపించి అందరినీ మైమరిపించింది. కార్యక్రమంలో ఆర్జీయుకేటి బాసర స్పెషల్ ఆఫీసర్ సృజన, స్పిక్‌మెకే తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ కుమారి రచన పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: విద్యార్థులు చదువుతోపాటు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల మైదానంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి 8వ ఇంటర్ జూనియర్ (బాలికల) సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి క్రీడాకారిణులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. మొదటి స్థానంలో నిజామాబాద్ జట్టు, ద్వితీయ స్థానంలో ఆదిలాబాద్ జట్టు, తృతీయ స్థానంలో మహబూబ్‌నగర్ జట్టు నిలిచాయి. ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవిందర్ రెడ్డి, నాయకులు దేవేందర్ రెడ్డి, పాఠశాల ప్రత్యేక అధికారి రజిత, ఇండియన్ సాఫ్ట్‌బాల్ జాయింట్ సెక్రెటరి శోభన్‌బాబు ఉన్నారు.

ఆవు, లేగదూడ పట్టివేత

తానూరు: మహారాష్ట్ర నుంచి ముథోల్‌కు ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న ఆవు, లేగదూడను శుక్రవారం రాత్రి తానూరు సమీపంలో పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాలీ ఆటోలో ఆవు, లేగదూడ అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న హిందు వాహిని, భజరంగ్‌దళ్ కార్యకర్తలు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సందీప్‌తో పాటు పోలీసులు మహాలక్ష్మి ఆలయం సమీపంలో ఆ ఆటో ట్రాలీని పట్టుకున్నారు. ఆవును, లేగదూడను శనివారం భైంసా గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపాడు.

ఉద్యోగి ప్రాణం తీసిన వేధింపులు!

జన్నారం: సెలవుల విషయంలో వేధింపులు ఓ ఉద్యోగి ప్రాణం తీశాయి. వేధింపులతో మనస్తాపంతో పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మృతుడి తల్లి సరస్వతి, ఎస్సై సతీష్ వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కడెం నీటి పారుదల శాఖ కార్యాలయంలో జన్నారం మండల కేంద్రానికి చెందిన తోకల రాకేష్(37) టెక్నికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. అతడి తండ్రి మూడు నెలల క్రితం చనిపోయాడు. సెలవుల విషయంలో అదే కార్యాలయంలో పని చేస్తున్న సూపరింటెండెంట్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ వేధింపులకు గురిచేశారు. ఈ విషయం తన కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. ఇటీవల కాలంలో రాకేష్ తండ్రి మూడు నెలల కర్మ కోసం సెలవు అడగడంతో వారు నానా విధాలుగా దుర్భాషలాడారు. దీంతో మనస్తాపం చెందిన రాకేష్ గురువారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా శనివారం ఉదయం చనిపోయాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ



మాట్లాడుతున్న బాధిత రైతులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామానికి చెందిన రైతుల విద్యుత్ మోటార్లకు సంబంధించిన వైర్లు చోరీకి గురవుతున్నాయి. వారం రోజులుగా గ్రామంలోని గోదావరి తీరంలో సుమారు 10మంది రైతులకు చెందిన వైర్లు చోరీకి గురయ్యాయని బాధిత రైతులు శనిగారపు ప్రసాద్, జెట్టి భూమేష్, అంబటి సంపత్ శనివారం తెలిపారు. తమతో పాటు గ్రామంలోని అడ్వాల భూమన్న, కమ్మల ప్రసాద్, అడ్వాల రమేష్‌లకు చెందిన వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తు కెళ్తున్నారని వాపోయారు. ఒక్కో రైతుకు సంబంధించిన వైరు విలువ సుమారు రూ.10వేలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎత్తుకెళ్లిన వైరును ఒక చోట చేర్చి కాల్చి అందులోని రాగి వైరును విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఆరు నెలలుగా ఇదే తరహాలో వరుస చోరీలు జరుగుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా చోరీలను నియంత్రించాలని అధికారులను వేడుకుంటున్నారు.

ఫిర్యాదుపై విచారణ



పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారి ప్రశాంత్ పాటిల్

బేల: మండలంలోని బాది అటవీ శాఖ సెక్షన్ పరిధిలోని మశాల(కె) అటవీ ప్రాంతంలో టేకు చెట్ల స్మగ్లింగ్, అటవీ బండరాళ్ల సంపద వ్యాపారం చేస్తున్న మడావి పోతు, దీనికి సహకరిస్తున్న బేల అటవీ రేంజ్ అధికారి అరుణ, సెక్షన్ అధికారి రవి, బీట్ అధికారులపై శనివారం జిల్లా కేంద్రంలో జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్‌కు జంగుబాయి దేవస్థానం కమిటీ మశాల(కె) బృందం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆ జిల్లా అధికారి సంఘటన స్థలానికి టాస్క్‌ఫోర్స్ బృందంతో వెళ్లి టేకు చెట్ల నరికివేత, స్మగ్లింగ్, బండరాళ్ల వ్యాపారం, తదితర అంశాలపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే పూర్తిస్థాయి విచారణ చేసి, నిజనిర్ధారణ సమగ్రంగా పూర్తిచేసి, ఆ తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట జంగుబాయి దేవస్థానం కమిటీ సభ్యులు మర్స కాశిరాం, ఆడ శంకర్, కుంర హన్మంతు, చిక్రం సంభు, చిక్రం మహేందవ్ ఉన్నారు.

ఒకరి ఆత్మహత్య

బేల: మండలంలోని సోన్‌ఖాస్ గ్రామానికి చెందిన పెట్కులే సంతోష్(22) శనివారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పెట్కులే సంతోష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం ఇంట్లో భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య దివ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతి



స్వామి.(ఫైల్)

తాంసి: రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్ మృతిచెందిన సంఘటన మండలంలోని పొన్నారి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... పొన్నారి గ్రామానికి చెందిన మలపతి స్వామి(39) తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో ఇంటి నుంచి పంట చేనుకు నడుచుకుంటూ వెళ్తుండగా గ్రామ సమీపంలో గుర్తు తెలియని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్వామిని స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించడంతో అర్ధరాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ఏఎస్సై కేశవ్ స్వామి పరిశీలించి పంచనామా నిర్వహించారు. మృతుడి సోదరుడు ఆశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపాడు. మృతునికి భార్య రజిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

'కడెం' మరమ్మతుకు నిధులు



ప్రాజెక్ట్ వైరింగ్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది(ఫైల్)

- ఎలక్ట్రికల్ వ్యవస్థ పునరుద్ధరణకు రూ.3.81 కోట్లు
- ఈనెల 22న టెండర్ ఖరారు
- తీరనున్న విద్యుత్ సమస్యలు

కడెం: రెండేళ్లుగా వానాకాలంలో వచ్చిన భారీ వరదలకు దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు మరమ్మతులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇటివలే ప్రాజెక్టు వరద గేట్ల మరమ్మతుకు రూ.5.46 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం తాజాగా, ఎలక్ట్రిక్ వ్యవస్థ పునరుద్ధరణ కోసం రూ.3.81 కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు ఈనెల 15న జీవో విడుదల చేసింది. ఈనెల 22 నాటికి టెండర్ ప్రక్రియ ముగించి పనులు ప్రారంభించేలా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఎన్నాళ్లకో..

కడెం ప్రాజెక్టు నిర్మించి 60 ఏళ్లు గడుస్తున్నా నేటికీ అప్పటి విద్యుత్ వ్యవస్థతోనే నెట్టుకొస్తున్నారు. ప్రాజెక్టు నిర్వహణలో విద్యుత్ వ్యవస్థ కీలకమైంది. వైరింగ్ వ్యవస్థ పని చేయక పలుమార్లు గేట్లు ఎత్తలేని పరిస్థితి నెలకొంది.అప్పటి వైరింగ్, ప్యానెల్ బోర్డ్స్, లైటింగ్ వ్యవస్థలతో తరచూ ఇబ్బందులు త లెత్తుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు వరద గేట్ల పట్టించుకుని, ఎలక్ట్రికల్ వ్యవస్థపై దృష్టి పెట్టడం లేదు.

విద్యుత్ సమస్యలు తీరుతాయి



కడెం ప్రాజెక్టు విద్యుత్ వ్యవస్థ చాలా ఏళ్ల క్రితం నాటిది, మరమ్మతులు లేక ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారింది. ఇటీవలే ప్రాజెక్టు విద్యుత్ వ్యవస్థను పూర్తిగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసింది. టెండర్ పూర్తికాగనే వానాకాలం నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరావు, ఏఈఈ, ఎలక్ట్రికల్

విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరణ

కడెం ప్రాజెక్టుకు మొత్తం 18 వరద గేట్లు ఉన్నాయి. వీటిని అపరేట్ చేసేందుకు 450 కిలోవాట్ సామర్థ్యం ట్రాన్స్‌ఫార్మర్ అవసరం, కానీ అక్కడ 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మాత్రమే ఉంది. అది కూడా గ్రామానికి లింకు ఉండడంతో తరచూ విద్యుత్ అంతరం ఏర్పడుతుంది. పనులు ప్రారంభించి, విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరిస్తే సమస్యలు తీరనున్నాయి. ప్రాజెక్టు వద్ద 500 కిలోవాట్ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్, ప్రస్తుతం ఉన్న 100 కేవీ జనరేటర్‌తోపాటుగా, 160 కేవీ సామర్థ్యం గల మరో నూతన జనరేటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే కేబుల్స్, వైరింగ్, ప్యానల్ బోర్డ్స్, లైటింగ్ సిస్టం ఆధునికీకరిస్తారు.

ఆదర్శ రైతు రామేశ్వర్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న గాయక్‌వాడ్ రామేశ్వర్

ఇచ్చోడ: మండలంలోని నవేగావ్ గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు గాయక్‌వాడ్ రామేశ్వర్ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా శనివారం హైదరాబాద్‌లోని మాదపూర్ హైటెక్ సిటీలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ రైతు అవార్డును అందుకున్నాడు. గ్రామ భారతి కిసాన్ ఎక్స్ పో వారి ఆధ్వర్యంలో శనివారం కిసాన్ మేళా నిర్వహించారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా ఆదర్శ రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ రైతులకు అవార్డులు అందచేసినట్లు రామేశ్వర్ తెలిపారు. రామేశ్వర గత పదేళ్ల నుంచి సేంద్రియ వ్యవసాయం ద్వారా వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నాడు.

23న మహాసభ

భైంసాటౌన్: వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు హక్కుల సాధన కోసం ఈనెల 23న భైంసాలో యూనియన్ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ తెలిపారు. పట్టణంలోని హమాలీ యూనియన్ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డుల్లో పనిచేస్తున్న హమాలీలు, దడ్‌వాయిలు, చాటావాలాల సమస్యలు పరిష్కరించాల ని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఇన్సూరెన్స్, బోనస్, పెన్షన్ కల్పించాలని కోరారు. ఈ మేరకు కా ర్మికుల సమస్యలపై అవగాహన కల్పించేందు కు యూనియన్ మహాసభకు రాష్ట్ర, జిల్లా నా యకులు హాజరవుతారని తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చే యాలని కోరారు. హాజీ, బి.శివాజీ, పి. ము త్యం, బి.సందేశ్, సట్వాజి, రాజుబాయి, పొ త్తూరి సావిత్రిబాయి, విఠల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

ఉక్కపోత... రోగుల అవస్థ.. అనే శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి రిమ్స్ డైరెక్టర్ స్పందించి అక్కడున్న ఫ్యాన్‌లకు మరమ్మతు చేయించారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్